# గుండె చెరువైంది

నారాయుడువచ్చి కృష్ణ గట్టుమీద నిలబడ్డాడు. పదేళ్ళ పసివాడైనా, వాడిమనసులో అగ్నిపర్వతాలు రగులుతున్నాయి. లావాలు ప్రవహిస్తున్నాయి. స్నానాల రేవులోకి దిగి మెట్లమీద కూర్చున్నాడు కృష్ణలో నీరేమీ లేదు. అంతా పట్టి ఇసుకపర్ర. బారేజికి అవతల నీరంతా బంధించి ఉండటంతో కృష్ణలంకవైపు అక్కడక్కడ నీటిపాయలు మాత్రం నిశ్చలంగా నిలబడి ఉన్నాయి. గుండెలు ఎండిపోయిన తల్లి దగ్గరకి వచ్చి పాలకోసం తడుముకుంటున్న పసిపాపలా నారాయుడు చల్లని ఓదార్పుకోసం అక్కడికి వచ్చాడు.

నారాయుడు చేతిలో సీసా ఉంది. ఆలోచిస్తూ అప్పుడప్పుడు దాన్ని చూస్తూ, తన నెవరైనా చూస్తున్నారేమోనని దిక్కులు చూస్తున్నాడు. ఇంకా ఎండ పూర్తిగా తగ్గలేదు. వానాకాలం వెనుకబడింది. చలి ముదరక పోయినా, గాలిలో చల్లదనం నాలుగువైపులా వ్యాపించింది.

కృష్ణమ్మని చూస్తే నారాయుడికి అమ్మ గుర్తుకొస్తుంది. ముఖ్యంగా

ఇలా ఎండిపోయిన నదిలో అమ్మ రూపమే కనిపిస్తుంది. తన దగ్గర ఏమీ లేకపోయినా. ఏదో ఇవ్వాలని తాపత్రయపడుతుంది కొడుకుకోసం.

పొద్దుటినుంచీ ఏమీ తినలేదు నారాయుడు. అయినా. వాడి కడుపులో ఆకలిని మించిన కసి నిండి ఉంది. కసితో పసివాడికి కళ్ళలో నీరూరు తోంది.

మళ్ళీ చేతిలో ఉన్న సీసా చూసుకున్నాడు. దాన్నిండా సారాఉంది. దానికోసమే అసలు గొడవంతా జరిగింది. అమ్మ జ్ఞాపకమొచ్చి మళ్ళీవాడికి దుఃఖం పెల్లుబికింది. కళ్ళలో నీరు ఆగటం కష్టమైంది. గొంతులో బాధ గరగర మంటోంది. పొద్దున్న జరిగింది మరచిపోదామనుకున్నా, కుదరటం లేదు.

ఆటో బాబయ్య అనుకోకుండా వూడిపడ్డాడు. వస్తూనే కాస్సేపు కబుర్లు చెప్పి అయ్య చెవిలో— "మంచి సరుకు తెచ్చాను" అంటూ గుస గుసలాడాడు. అంతే...అమ్మ బాబయ్యని నానా తిట్లూ తిట్టింది.

"నా మొగుడే ఇల్లూ, వాకిలీ పట్టక తిరుగుతా ఉంటే, నువ్వోడివా నాయనా, దొల్లేదాలు" అంటూ బాబయ్యమీద విరుచుకు పడింది. అమ్మ మాటలు బాబయ్య పెద్దగా పట్టించుకోలేదు. నవ్వేసి, సీసా అయ్య చేతిలో పెట్టి, వూర్లో పనిచూసుకు వస్తానని వెళ్ళిపోయాడు. అది గూట్లో పెట్టాడు అయ్య. నారాయుడి చిన్న మనసు కుతకుతలాడిపోయింది. తండ్రిమీద కోపం కట్టలు తెంచుకుంది. రోజూ తప్ప తాగి వస్తూనే ఉంటాడు. అకార ణంగా అమ్మని చితక తన్నుతూనే ఉంటాడు. అమ్మ కష్టపడి తెచ్చిన అన్నంతినేసి, నాలుగు తన్నేసి పోతుంటాడు. అలాంటి వేళల్లో తనుబిక్క చచ్చి మంచంకిందదూరి, పొట్టలో కాళ్ళు పెట్టుకుని పడుకుంటాడు. అమ్మ లేపి అన్నం పెడితే అయిష్టంగానే తింటాడు. అందుకే ఈరోజు సీసా తీసి దాచేశాడు. ఎవరికీ తెలీనచోట దాచేశాడు. అది అమ్మే దాచిందని అయ్య,

అమ్మని దావ చితక్కొట్టాడు. తను భయంతో బిగుసుకుపోయాడు. తల్లిని ఏదో రక్షించాలని తను చేసింది వక్రించిందని తల్లడిల్లిపోయాడు. ఎవరి కంటా పడకుండా సీసా తీసుకు పారిపోయి వచ్చేశాడు.

పొద్దుటినుంచీ రోడ్లన్నీ తిరిగి తిరిగి కృష్ణ ఒడ్డుకి చేరాడు నారాయడు. సముద్రంవైపు ప్రవహించే వోపికలేక సగంలోనే ఆగిపోయిన కృష్ణమ్మ కునికిపాట్లు పెడుతున్నట్లుంది.

ఒక్కసారిగా నారాయడిలో ఆవేశం పొంగింది. కసి చెలరేగింది. అయ్య రోజూ తాగివచ్చి అమ్మని కొడతాడు. అంటే తాగితే బోలెడంత బలం వస్తుందన్నమాట. అయ్య అమ్మని జుట్టుపట్టి కొడుతుంటే మీదికి ఎగిరి తన్నాలనిపిస్తుంది తనకి. కానీ, తను చిన్నవాడు. బలంలేదు. అందులో అయ్య తాగి ఉంటాడు. అందుకే ఈ రోజు ఈ సీసా అంతా తాగేసి, ఇంటికెళ్ళి అయ్యమీదకి ఎగిరి, జుట్టుపట్టుకుని తన బలమంతా పెట్టి తన్నాలి. తనూ తాగితే తనకీ బలమొస్తుందిగా—అందుకే ఈ సీసా-అంతా తాగేస్తాడు తను.

నారాయడి ఆలోచనలు గతి తప్పి పరుగులు పెడుతూనే ఉన్నాయి. ఒకపక్క భయం, సంకోచం, మరోపక్క కసి, ప్రతీకారం వాడి మనస్సుని ఊపేస్తున్నాయి. నారాయడు మెట్లు దిగి మెల్లగా ఇసుకలో నడవటం మొదలుపెట్టాడు. ఎంత దూరమో, ఎక్కడికో తెలీని నడక అది. నిర్జనమైన ఆ ప్రదేశంలో నారాయడి నడక ఎవరిక్కావాలి? నడచి రైలుబ్రిడ్జి కింద స్తంభానికి ఆనుకుని కూర్చున్నాడు.

నెమ్మదిగా సీసా ఎత్తి కొంచెం తాగాడు. గొంతు మండిపోయింది. భగ్గున, కడుపులో తిప్పింది. అయినా వాడు ఆగలేదు. తను తాగెయ్యాలి. బలం రావాలి. అయ్యని తన్నాలి. తనంటే అయ్య ఒణికిపోయి అమ్మను కొట్టడం మానెయ్యాలి. అప్పుడే తనకి హాయిగా ఉంటుంది.

మళ్ళీ కాస్త తాగాడు—మళ్ళీ కాస్త—మళ్ళీ కాస్త, నారాయుడు సీసా అంతా తాగేశాడు. భళ్ళున కక్కుకున్నాడు. కళ్ళుతిరిగి తూలిపడ్డాడు. స్తంభం పక్కనే ఇసుకలో ఒరిగాడు. ఏదో రైలు బ్రిడ్జిమీదికి వస్తూంది. కొండలు దొర్లివస్తున్నట్లు చెవులు హోరెత్తిపోయే శబ్దం.

నారాయడి కళ్ళు మూతలు పడిపోతున్నాయి. అంతలో వాడి ఒళ్ళో ఒక పడిపైసల బిళ్ళ పడింది. కళ్ళు తెరిచి బలవంతంగా చూశాడు. రైలు బ్రిడ్జిమీంచి వెళ్ళిపోయింది.

వెలిబూది రాలుతున్నట్లు వెన్నెల ఇసుకంతా పరుచుకుంది. గాలిని చలి గాఢంగా కౌగిలించుకుంది. అక్కడక్కడ ఉండే జనం ఎప్పుడో వెళ్ళిపోయారు. ఎవరూ నారాయణ్ణి చూడలేదు. వాడు ఎవర్నీ చూసే స్థితిలో లేడు.

రాత్రిలోకి సమయం కదులుతూంది. అమాయకమైన పసివాడు మైకంలోపడి ఉన్నాడు. అప్పుడే— సరిగ్గా అదే సమయంలో "యముని మహిషపు లోహ ఘంటలు మబ్బు దాటున ఖణేల్ మన్నాయ్—నరక లోకపు జాగిలమ్ములు గొలుసు తెంచుకు ఉరికిపడ్డాయ్"

నీటిని వదిలేముందు విక్కచ్చిగా కూసే సైరన్ ఘీంకరించింది. మృత్యుదేవత గృహకవాటాలు మృదువుగా తెరుచుకున్నాయ్. కోరల కెరటాలను ముందుకు, మునుముందుకు దాస్తూ - బోనులోంచి తప్పించుకున్న క్రూరమృగంలా ఉరికింది నీరు.

ఏటిగాలి కృష్ణలంకని ఎగిరి ఎగిరికొట్టింది. రాత్రి బిడ్డ ఇంటికి రాలేదని కడుపులో దిగులై కన్నతల్లి కట్ట ఎక్కి చూస్తే, పుడమితల్లికి గుండె చెరువై దిక్కులన్నీ ఒక్కటయినాయి.

●